క్లుప్తంగా

ఆర్థికసాయం

పాలకుర్తి: మండల కేంద్రానికి చెందిన చిన్నాల అభిసారిక అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. కాగా, పాలకుర్తి సీఐ విశ్వేశ్వర్ బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం ఆదివారం అందజేశారు. అలాగే మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ అధినేత గంట రవీందర్ రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. పోతుగంటి నర్సయ్య, సంతోష్, గణేష్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

టాడీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో..



జనగామ రూరల్: శామీర్‌పేటలో ఇటీవల తాటిచెట్టుపై నుంచి పడి మార్క సిద్దులు మృతి చెందాడు. కాగా, టాడీ కార్పొరేషన్ ద్వారా రూ. 25 వేల ఆర్థిక సాయాన్ని కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లెరవికుమార్ బాధిత కుటుంబానికి అందజేశారు. జిల్లా బీసీ సంక్షేమాధికారి రవీందర్, ఎంపీపీ మేకల కళింగరాజు, కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ, జిల్లా కార్యదర్శి బాల్నె వెంకటమల్లయ్య, రాజేష్, మార్క ఉపేందర్ ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



బచ్చన్నపేట: మండలంలోని బండనాగారంలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ ఆలయ నిర్మాణానికి బీఆర్‌ఎస్ నాయకుడు కొప్పురవు విజయ్‌కుమార్ రెడ్డి రూ.5 వేల విరాళాన్ని ఆదివారం అందజేశారు. ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని కోరారు. మాజీ సర్పంచ్ చల్ల సుధాకర్‌రెడ్డి, కొల్ల వెంకట్‌రెడ్డి, కొల్ల నర్సిరెడ్డి, ఆర్‌ఎంపీ డాక్టర్ చక్రపాణి, శ్రీనివాస్, రాంబాబు పాల్గొన్నారు.

'అసత్య ఆరోపణలు సరికాదు'

పాలకుర్తి: చెన్నూరు కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు కారుపోతుల వేణు పాలకుర్తి ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో తమపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని గౌడ సంఘం సభ్యుడు మూల వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. తెలంగాణ కో–ఆపరేటివ్–1964 ప్రకారం జోడు పదవులు ఒకరికే ఉండటాన్ని రద్దు చేయాలని, చెన్నూరు గౌడ సొసైటీకి ఎన్నికలు నిర్వహించాలన్నారు. అసత్య ఆరోపణలు చేసిన వారిపై చర్య తీసుకోవాలని కోరినట్లుగా తెలిపారు. సంఘం మొలుగూరి యాకయ్య, మూల మల్లయ్య, మొలుగూరి వీరస్వామి, మొలుగూరి వీరస్వామి, రవి, మల్లేష్, చరణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

చేయూత



నర్మెట: మండల కేంద్రానికి చెందిన1990–1991 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు తోటి స్నేహితుడి కుటుంబానికి చేయూతనందించారు. ఆదివారం మండలంలోని అమ్మాపురం గ్రామానికి చెందిన తమ తోటి స్నేహితుడు గంగం వాసుదేవరెడ్డి వర్ధంతి సందర్భంగా అందరూ కలిసి సేకరించిన రూ.20వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. పూర్వ విద్యార్థులు తాండ్ర వీరారెడ్డి, బత్తుల నరేందర్, ఏలగొడ రవి, కన్నెబోయిన రామకృష్ణ, పాతూరి ఆంజనేయులు, చల్ల హరినాథ్‌రెడ్డి, చెంద్రమౌళి, బుచ్చిరెడ్డి, రాజు, విష్ణు, గణపతి, వంగ మల్లారెడ్డి పాల్గొన్నారు.

కందకం పూడ్చివేత



తరిగొప్పుల: మండలకేంద్రంలోని ప్రభుత్వ స్థలం కబ్జాకు గురికాకుండా ఉండేందుకు గతంలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన కందకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం పూడ్చివేశారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన ఫరీదుద్దీన్ మండలకేంద్రంలో సర్వే నంబరు 275లో ప్రభుత్వ భూమి చుట్టూ కందకం ఏర్పాటు చేయించారు. కాగా, గుర్తుతెలియని వ్యక్తి హద్దు రాళ్లు ఏర్పాటు చేసేందుకు కందకాన్ని పొక్లెయిన్ సాయంతో పూడ్చి వేయించాడు. రెవెన్యూ అధికారులు దృష్టి సారించి ప్రభుత్వ భూమి కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

22న మండల సర్వసభ్య సమావేశం

దేవరుప్పుల: ఈ నెల 22వ తేదీన మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ టి.సురేష్‌కుమార్ తెలిపారు. విధిగా ఆయా గ్రామాల ప్రజాప్రతినిధుల, అనుబంధ శాఖల అధికారులు తమ నివేదికతో సకాలంలో హాజరు కావాలన్నారు.

లింగాలఘణపురంలో..



రఘునాథపల్లి: జీపీ సిబ్బందికి మెమొంటో అందజేస్తున్న సర్పంచ్



జనగామ రూరల్: మాట్లాడుతున్న ఎంపీపీ మేకల కళింగరాజు



బచ్చన్నపేట: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, గ్రామస్తులు



ఊరూరా మంచినీళ్ల పండుగ



చిల్పూరు: ర్యాలీలో ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు

చిల్పూరు: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఊరూరా మంచినీళ్ల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీలు తీసి వాటర్ ట్యాంకుల వద్ద పూజలు చేపట్టారు. మిషన్ భగీరథ పథకంతో ఇంటింటా తాగునీటి సమస్యకు పరిష్కారం చూపిన గొప్ప మహనీయుడు సీఎం కేసీఆర్ అని జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎడవెల్లి కృష్ణారెడ్డి అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని వంగాలపల్లి, నష్కల్, చిన్నపెండ్యాల, చిల్పూరు, మల్కాపూర్, కొండాపూర్, లింగంపల్లి గ్రామాల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన మంచినీళ్ల పండగను నిర్వహించారు. సర్పంచ్‌లు ఆరూరి ప్రణీతప్రదీప్, కర్నకంటి స్వప్న, మామిడాల లింగారెడ్డి, ఉద్దెమారి రాజ్‌కుమార్, కొంగరి రవి, లొడెం రజిత, ఏదునూరి రవీందర్, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీఓ మధుసూదన్, ఉపాధి ఏపీఎం మోహన్ రావు, తహసీల్దార్ దేవ్‌సింగ్, పాల్గొన్నారు.

రఘునాథపల్లి: ఏ మహిళ తాగునీటి కోసం బిందెలతో రోడ్డెక్కొద్దని సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ పథకం మహిళలకు వరంలా అందించాడని జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పోకల శివకుమార్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో మిషన్‌భగీరథ ట్యాంక్ వద్ద మామిడి తోరణాలు, ముగ్గులు వేసి మంచినీళ్ల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా తాగునీటి సరఫరా చేసే పంచాయతీ సిబ్బందికి సర్పంచ్ మెమొంటోలు అందజేసి అభినందిచారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ నిర్మల, పంచాయతీ కార్యదర్శి భాస్కర్, వార్డు సభ్యులు ఇమ్మడిశెట్టి అనసూయ, కడారి మాధవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, వీఓఏలు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

జనగామ రూరల్: మండలంలోని శామీర్‌పేటలో మంచినీళ్ల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ మేకల కళింగరాజు హాజరై మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తూ దేశానికి ఆదర్శంగా నిలుపుతున్నారని అన్నారు. అనంతరం గ్రామ సిబ్బందిని సన్మానించారు. జెడ్పీ సీఈఓ వసంత, ఎంపీడీఓ హసీం, ఎంపీఓ సంపత్‌కుమార్, సర్పంచ్ స్వరూప, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో..

లింగాలఘణపురం: మండలంలోని అన్ని గ్రామాల్లో మంచినీళ్ల పండుగను నిర్వహించారు. ఓవర్ హెడ్ ట్యాంకులు, సంప్‌ల వద్ద అలంకరణ చేసి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి గతంలో నీటి సరఫరాకు ఇప్పుడున్న నీటి సరఫరాకు తేడాను వివరిస్తూ మిషన్ భగీరథ ప్రయోజనాలను గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, పంచాయితీ కార్యదర్శులు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. మండల కేంద్రంలో సర్పంచ్ విజయ్‌మనోహర్, ఎంపీటీసీ భిక్షపతి, ఆర్‌ఐ వెంకటేశ్వర్లు, పంచాయితీ కార్యదర్శి ప్రవీణ్ పాల్గొన్నారు.

బచ్చన్నపేట: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో మంచినీళ్ల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేసి ట్యాంకులకు మామిడి తోరణాలను కట్టి ముగ్గులు వేసి బ్యానర్లతో గ్రామంలో ర్యాలీలను నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నుంచి దశల వారిగా చెందిన అభివృద్ధిని గురించి వివరించారు. జిల్లా వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్ ఎంపీడీఓ రఘు రామకృష్ణ, తహసీల్దార్ గంగాభవాని, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొడకండ్ల: సమైక్య పాలనలో తాగునీటి కోసం అష్ట కష్టాలు ఎదుర్కొంటే తెలంగాణ సిద్ధించాక మహోన్నత ఆలోచనతో మిషన్ భగీరథతో మంచినీటి కష్టాలను సీఎం కేసీఆర్ నివృత్తి చేశారని ఎంపీపీ జ్యోతి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని అన్ని గ్రామాల్లో మంచినీళ్ల పండుగను నిర్వహించగా గిర్నితండాలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ పాల్గొన్నారు. అనంతరం మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజాప్రతినిధులు అబ్బాయిపాలెంలో జరిగిన వేడుకలకు తరలివెళ్లారు.

మిషన్ భగీరథ దేశానికే ఆదర్శం

తరిగొప్పుల: మిషన్ భగీరథ పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందని సర్పంచ్ దామెర ప్రభుదాస్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ మంచినీళ్ల పండుగ పురస్కరించుకొని ఆదివారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో మిషన్ భగీరథ వాటర్‌ట్యాంకుల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ర్యాలీ తీశారు. సర్పంచ్‌లు బీరెడ్డి జార్జ్‌రెడ్డి, వీరేందర్, బాలమణి, ఉప సర్పంచ్‌లు శ్రీనివాస్ , అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

జఫర్‌గఢ్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి మంచినీళ్ల పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ ద్వారా అందిస్తున్న స్వచ్ఛమైన నీటి విషయంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఉప సర్పంచ్ లత యాదగిరి, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి

దేవరుప్పుల: గ్రామీణ ప్రాంతాల ప్రజారోగ్య పరిరక్షణ కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని ఎంపీపీ బస్వ సావిత్రి అన్నారు. మండల కేంద్రంతోపాటు కామారెడ్డిగూడెం, సీతారాంపురం, కడవెండి తదితర గ్రామాల్లో నీటి తాగునీటి పండుగను నిర్వహించారు. పలు గ్రామాల్లో నీటీ సరఫరాకు సేవలందించిన మల్టీపర్పస్ వర్కర్లకు జ్ఞాపికలను ఇచ్చి అభినందించారు. ఆర్‌డబ్ల్యుఎస్ జిల్లా అధికారి శ్రీనివాస్, సర్పంచ్‌లు రమాదేవి, అంజమ్మ, రమేష్, బెల్లీనా, ఎంపీటీసీ దుబ్బాక కవిత, మార్కెట్ డైరెక్టర్ భిక్షపతి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రమేష్, మధుకర్, వెంకన్న, అంజలి, స్వప్న, బత్తిని వెంకన్న పాల్గొన్నారు.



పాలకుర్తి టౌన్: మాట్లాడుతున్న యాకాంతరావు

పాలకుర్తిలో..

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలో మంచినీళ్ల పండుగ ఘనంగా నిర్వహించారు. రాజీవ్ చౌరస్తా నుంచి ప్రాథమిక పాఠశాలలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచ్ వీరమనేని యాకాంతరావు మాట్లాడారు. ఎంపీటీసీ పురుషోత్తం, డీఈ సంధ్యారాణి, ఏఈ ప్రశాంతితోపాటు తదితరులు పాల్గొన్నారు.



దేవరుప్పుల: ర్యాలీలో ఎంపీపీ తదితరులు



కొడకండ్ల: నీళ్ల పండుగకు తరలిన ప్రజాప్రతినిధులు తదితరులు



జఫర్‌గఢ్‌లో..



తరిగొప్పులలో..

మత్స్య కార్మికుల ఉపాధి కల్పనకు చర్యలు



రవీందర్‌తో ముదిరాజ్ ఐక్యవేదిక ప్రతినిధులు

దేవరుప్పుల: తెలంగాణ ప్రభుత్వం కల్పించే రాయితీలతో మత్స్య కార్మికుల ఉపాధి కల్పన ప్రత్యేక కృషి చేస్తానని రాష్ట్ర ఫెడరేషన్ అఫ్ ఫిషరీస్ అండ్ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ పిట్టల రవీందర్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో ఇటీవల చైర్మన్‌గా ఎన్నికై నందుకు రవీందర్‌ను ముదిరాజ్ ఐక్యవేదిక ప్రతినిధులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తెలంగాణ పునర్నిర్మాణ దిశలో శాశ్వత ప్రాతిపదికన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవడమేగాక కులవృత్తుల పూర్వ వైభవం కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నారన్నారు. ఈ దిశలో దశలవారీగా ప్రభుత్వం అందించే పథకాలను ఆయా సామాజిక వర్గాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముదిరాజ్ ఐక్య వేదిక కన్వీనర్ గొడుగు మల్లికార్జున్, ప్రొఫెసర్ నల్ల సుభాష్ చంద్ర, వాకాటి సత్యనారాయణ ఉన్నారు.

వీరస్వామి సేవలు మరువలేనివి



నివాళులర్పించి ఆర్థికసాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొడకండ్ల: సుదీర్ఘ కాలం పాటు కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతి కోసం పనిచేయడమే కాకుండా మూడు పర్యాయాలు వార్డుసభ్యుడిగా ప్రజా సంక్షేమం కోసం కృషి చేసిన పాడిశెట్టి వీరస్వామి సేవలు మరువలేనివని బ్లాక్ కాంగ్రెస్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, సురేష్‌నాయక్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజేష్‌నాయక్, మాజీ సర్పంచ్ పేరం లక్ష్మీశ్యాం అన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన వీరస్వామి మృతదేహానికి కాంగ్రెస్ జెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. వీరస్వామి కుటుంబానికి పార్టీ అన్ని విధాల అండగా ఉంటుందని, రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. అలాగే మార్కెట్ చైర్మన్ పేరం రాము, ఈజీఎస్ డైరెక్టర్ అందె యాకయ్య, సర్పంచ్, ఉపసర్పంచ్ మధుసూదన్, రమేష్, మాజీ సర్పంచ్ ఉప్పల చిన్నసోమయ్యతో పాటు కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు వీరస్వామికి నివాళులు అర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం జరిగిన వీరస్వామి అంతిమయాత్రలో వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.

నియామకం



నియామకపత్రం అందుకుంటున్న వేణుగౌడ్

స్టేషన్‌ఘన్‌పూర్: మన తెలంగాణ రాష్ట్ర సమాఖ్య పార్టీ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని శివునిపల్లికి చెందిన డాక్టర్ వంగ వేణుగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ తాటికాయల శరత్‌బాబు చేతుల మీదుగా వేణుగౌడ్‌కు ఆదివారం నియామకపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వేణుగౌడ్ మాట్లాడుతూ మన తెలంగాణ రాష్ట్ర సమాఖ్య పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియామకం కావడం సంతోషంగా ఉందని, పార్టీ నిబంధనలకు కట్టుబడి క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేలా అహర్నిశలు పనిచేస్తానన్నారు.

ఉద్యమ ఫలితంగానే బీఐఎస్ హాల్‌మార్క్

ఖిలా వరంగల్: సీసీఐ దీర్ఘకాల ఉద్యమ ఫలితంగానే బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) హాల్‌మార్క్‌ను కేంద్ర ప్రభుత్వ వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రవేశ పెట్టిందని కన్జ్యూమర్ కాన్ఫిడెరేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్ అన్నారు. జూన్ 15నుంచి ప్రతి ఆభరణంపై హాల్‌మార్క్, హెచ్‌యూఐడీ నంబర్‌ను తప్పనిసరిగా ముద్రించాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసిందని వివరించారు. దీనిపై వినియోగదారులను చైతన్యం చేయాలని వినియోగదారుల ప్రతినిధులకు సూచించారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని జిల్లా వినియోగదారుల సమాఖ్య కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

మోకాళ్లపై మెట్లు ఎక్కి మొక్కు తీర్చుకున్న భక్తుడు



పాలకుర్తి టౌన్: అనుకున్న కోరిక నెరవేరడంతో ఓ భక్తుడు ఆదివారం పాలకుర్తి సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయం గుట్టపైకి 351 మెట్లు మోకాళ్లపై ఎక్కి దర్శనం చేసుకున్నాడు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం హరిపిరాలకు చెందిన ఎల్లంకి సాయికుమార్ తను అనుకున్న కోరిక నెరవేరితే సోమేశ్వరస్వామి ఆలయం గుట్టపైకి మోకాళ్లపై నడుస్తూ వచ్చి దర్శించుకుంటాని గతంలో మొక్కుకున్నానని, అనుకున్న ప్రకారం మోకాళ్లపై మెట్లు ఎక్కి మొక్కు తీర్చుకున్నానని తెలిపారు.

నివాళి



దేవరుప్పుల: మండలంలోని పెద్దమడూరుకు చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు కడకంటి నర్సయ్య మృతి చెందాడు. కాగా, ఆయన మృతదేహంపై తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సింగారపు రమేష్ ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనునిత్యం ఎర్రజెండా పక్షాన నిలిచి, గ్రామంలో అనేక సమస్యలపై పోరాటం చేశారన్నారు. బాధిత కుటుంబానికి పార్టీపరంగా అండగా ఉంటామన్నారు. మండల నాయకులు పయ్యావుల బిక్షపతి,ఇంటి వెంకట్ రెడ్డి,గడ్డం యాదగిరి , పెద్దగోని వెంకన్న, బబ్బూరి సత్తయ్య, సత్తయ్య,జోగు భిక్షపతి ఉన్నారు.

దివ్యాంగుల పింఛన్ రూ.6వేలకు పెంచాలి



మాట్లాడుతున్న రాగల్ల ఉపేందర్

లింగాలఘణపురం: పెరుగుతున్న నిత్యావసర వస్తువులకు అనుగుణంగా దివ్యాంగుల పింఛన్‌ను రూ.6వేలకు పెంచాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కళ్లెంలో దివ్యాంగుల సమావేశం తిప్పారపు బాలయ్య అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా ఉపేందర్ మాట్లాడుతూ దివ్యాంగులకు న్యాయబద్ధంగా రావాల్సిన హక్కులు రావడం లేదని, 30 రకాల డిమాండ్లను పరిష్కరించడంలేదని, మంత్రి త్వ శాఖను ఏర్పాటు చేయడంలేదని, బడ్జెట్ కేటాయించకుండా రుణాలు ఇవ్వడంలేదన్నారు. వీటన్నింటిపై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ పిలుపు మేరకు దివ్యాంగులు పోరా టానికి సిద్ధం కావాలన్నారు. వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కుమార్ మాట్లాడుతూ దివ్యాంగులకు సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత కల్పించాలని, ఉపాధి రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నగేష్, రవీందర్, మధు, సోమరాజు, ఐలయ్య, భిక్షపతి, నర్సిరెడ్డి, ఎల్లయ్య, యాదమ్మ, సుశీల, మంజుల పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ భిక్షపతి

జనగామ రూరల్: పట్టణంలోని 16వ వార్డులో పేదలు, బుడగజంగాలకు ఆదివారం డాక్టర్ మాచర్ల భిక్షపతి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేపట్టారు. శిబిరానికి రాలేనివారి ఇంటివద్దకు వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. పిట్టల సత్యం, కుందం శ్రీనివాస్, కడకంచి మహేష్, కనకరాజు, ఉపేందర్ పాల్గొన్నారు.

వరంగల్‌లో భారతీమహాస్వామి విజయయాత్ర

హన్మకొండ కల్చరల్: బెంగళూరుకు చెందిన శృంగేరీ శివగంగ శారదా మఠాధీశ్వరులు పురుషోత్తమ భారతీమహాస్వామి విజయయాత్రలో భాగంగా ఈనెల 20, 21వ తేదీల్లో వరంగల్‌లో పర్యటించనున్నారు. శారదావిద్యారణ్య చారిటబుల్ ట్రస్ట్, జగద్గురు ఆదిశంకరాచార్య సమితి ట్రస్ట్, శంకర సేవా సమితి ఆధ్వర్యంలో జరగనున్న కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం వరంగల్‌లోని శృంగేరీమఠంలో చంద్రమౌళీశ్వర పూజలు, బుధవారం ఉదయం నుంచి భద్రకాళి దేవాలయం, వేయిస్తంభాల దేవాలయం, పద్మాక్షి దేవాలయాలను సందర్శించనున్నారు.

జయప్రదం చేయండి

కరీమాబాద్: నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలనే డిమాండ్‌తో తెలంగాణ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న బస్సుయాత్రను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు సీహెచ్.రంగయ్య పిలుపునిచ్చారు. ఉర్సుగుట్ట ఆర్‌ఎస్ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుడిసెలు వేసుకున్న పేదలందరికీ జీఓ 58, 59 ప్రకారం పట్టాలివ్వాలని సూచించారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈనెల 12నుంచి 18వరకు కార్పొరేషన్ పరిధిలోని 23 డివిజన్లలో ప్రజల సమస్యలపై సర్వే నిర్వహించినట్లు వివరించారు. ఈక్రమంలో ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని వెల్లడైనట్లు చెప్పారు. ఈనెల 21న నాయుడు పెట్రోల్ పంపు – ఆర్టీఏ జంక్షన్ వద్ద నిర్వహించనున్న సభను జయప్రదం చేయాలని కోరారు.